26న బహిరంగ వేలం పాట

ఎస్పీ నారాయణ రెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 22 : పోలీస్ వాహనాలకు వాడిన పాత టైర్లు, ట్యూబులు, బ్యాటరీలు, వివిధ రకాల విడి భాగాలను బహిరంగ వేలం వేయనున్నట్లు వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాట ఈ నెల 26న ఉదయం 10 గంటలకు జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఆవరణలో నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేలంపాటలో ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని తెలిపారు. మిగతా వివరాలకు ఆర్ఐ అంజాత్ పాషా సెల్ నంబర్ 8712670028లో సంప్రదించాలని తెలిపారు.

నేడు జీహెచ్ఎంసీ ఉద్యోగులకు సెలవు

సిటీబ్యూరో, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ దృష్ట్యా బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయ ఉద్యోగులకు సెలవు ప్రకటించినట్లు అడ్మిన్ విభాగం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోనే రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయడం, పోలింగ్ సజావుగా సాగేందుకు ఆర్మీ, ఇతర పోలీస్ బలగాలను ఏర్పాటు చేయడం, ఓటర్లను తప్ప ఇతరులకు ఎవ్వరికీ లోనికి వెళ్లేందుకు అవకాశం ఉండదని అధికారులు తెలిపారు. ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈనెల 23వ తేదీన ఉద్యోగులకు సెలవు ఉంటుందని, జూన్ 14వ తేదీన (రెండవ శనివారం) వర్కింగ్ డేగా పేర్కొంటూ ఆదేశాలు జారీ చేశారు.

ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టులను పూర్తి చేయండి

జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

సిటీబ్యూరో, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): ఎస్ఆర్‌డీపీ ద్వారా చేపట్టిన శిల్పా లే అవుట్ రెండో దశ గచ్చిబౌలి నుంచి కొండాపూర్ వరకు చేపట్టిన ఫ్లై ఓవర్ పనులు మే 15వ తేదీలోగా పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన ప్రాజెక్టు అధికారులు, భూసేకరణ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శిల్పా లే అవుట్ రెండో దశ నిర్మాణ పనులు దాదాపు పూర్తయిన నేపథ్యంలో సర్వీస్ రోడ్డు పూర్తి చేయడానికి ఇంకా ఐదు ఆస్తులను సేకరించాల్సి ఉందని చెప్పారు. శాస్త్రిపురం, ఫలక్‌నుమా ఆర్వోబీ పనులను జూన్ నెల వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శివ కుమార్ నాయుడు, ప్రాజెక్టు సీఈ భాస్కర్ రెడ్డి, భూ సేకరణ డిప్యూటీ కలెక్టర్ రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

రిటర్నింగ్ అధికారి అనురాగ్

సిటీబ్యూరో, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. ఎన్నికల ఏర్పాట్లపై మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, మొత్తం 112 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, రెండు పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సిబ్బందితో పాటు మరికొంత మంది సిబ్బందిని రిజర్వ్‌లో పెట్టామని చెప్పారు. దాదాపు 500 మంది అధికారులు, సిబ్బంది ఎలక్షన్ డ్యూటీలో పాల్గొంటారన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు, హైదరాబాద్ డిప్యూటీ కలెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను ఊరూరా బలోపేతం చేయాలి

- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి
- చిట్టంపల్లి గేట్ వద్ద పార్టీ కార్యాలయం ప్రారంభం

చిట్టంపల్లి గేట్ వద్ద బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 22 : బీఆర్ఎస్‌ను ఊరూరా బలోపేతం చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి సూచించారు. మంగళవారం చేవెళ్ల మండలం అంతారం గ్రామ పరిధిలోని చిట్టంపల్లి గేట్ వద్ద బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ప్రభుత్వం జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కెప్టెన్ అంజన్ గౌడ్ నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని సబితారెడ్డి హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాను ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మోసపూరిత హామీలను గ్రామాల్లో ప్రజలకు తెలిసేలా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసిన కెప్టెన్ అంజన్‌గౌడ్‌ను సబితా రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. కష్టపడిన ప్రతి నాయకుడు, కార్యకర్తను అధిష్టానం గుర్తిస్తుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో అంతారం మాజీ సర్పంచ్ సులోచన, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్, పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి, నాయకులు రాము, వీరాంజనేయులు, వీరస్వామి, నవీన్, పాండుగౌడ్, కుమార్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఇంద్రారెడ్డి.. స్ఫూర్తిప్రదాత

మొయినాబాద్, ఏప్రిల్ 22 : పట్లోళ్ల ఇంద్రారెడ్డి స్ఫూర్తిప్రదాత అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డి అన్నారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ హోంమంత్రి దివంగత పట్లోళ్ల ఇంద్రారెడ్డి వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు చిలుకూరు, రెడ్డిపల్లి, నక్కలపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో వర్ధంతిని నిర్వహించగా సబితారెడ్డి, తనయుడు కౌశిక్‌రెడ్డి పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఇంద్రారెడ్డికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రాజకీయాల్లో విలువలను నిర్మాణం చేసి ఎంతో మందిని రాజకీయ నాయకులను తయారు చేసిన ఆదర్శ నాయకుడిగా పట్లోళ్ల ఇంద్రారెడ్డి నిలిచారన్నారు.తన రాజకీయ ప్రస్థానాన్ని గ్రామ స్థాయి నుంచి ప్రారంభించి ఉమ్మడి రాష్ట్ర రాజకీయాల్లో తన కంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుని, ఎంతో మంది రాజకీయ నాయకులకు స్ఫూర్తి దాయకంగా నిలిచారని తెలిపారు. పట్లోళ్ల కుటుంబం రాజకీయంగా ఎదగడానికి అండగా నిలిచిన చేవెళ్ల ప్రజలకు జీవితాంతం రుణపడి సేవలు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొత్త నర్సింహారెడ్డి, శ్రీహరియాదవ్,వెంకట్‌రెడ్డి, సుధాకర్‌యాదవ్, ఎంపరవూఫ్, కోట్ల నరోత్తంరెడ్డి, రవియాదవ్, పురాణం వీరభద్రస్వామి, జయవంత్, నర్సింహా గౌడ్, గణేశ్‌రెడ్డి, షేక్ మహబూబ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ డప్పు రాజు, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు మోర శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ కొత్త మాణిక్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, తిరుపతిరెడ్డి, రాజు, ప్రవీణ్‌రెడ్డి, చెన్నయ్యయాదవ్, హరిశంకర్‌గౌడ్, సత్తిరెడ్డి, అంజయ్యగౌడ్, విష్ణువర్ధన్‌గౌడ్, ఎండీ పాషా, బాలు, దర్శన్, పరమేశ్, ప్రవీణ్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

.మొయినాబాద్‌లో ఇంద్రారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సబితారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

పారదర్శకంగా అభివృద్ధి పనులు

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్లు తదితరులు

వికారాబాద్, ఏప్రిల్ 22 :ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను పారదర్శకంగా చేపట్టాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉన్నతాధికారులతో కలిసి రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూభారతి, ఇందిరమ్మ ఇండ్లు, ఎల్ఆర్ఎస్‌పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం అధికారుల ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ నిర్దేశాలకు అనుగుణంగా ముందుగా అతి పేద వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సిఫార్సు జాబితాలను పరిగణలోకి తీసుకొని ఎమ్మెల్యేల ఆమోదంతో లబ్ధిదారుల ఎంపిక ఉండాలని అధికారులకు సూచించారు. భూముల రిజిస్ట్రేషన్, క్రమబద్ధీకరణ, రికార్డుల్లో మార్పులు చేర్పులు తదితర సేవలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. భూ భారతి నూతన ఆర్‌వోఆర్ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ నెల ఆఖరు వరకు ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు అవకాశం ఉన్నందున ఆ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ఆర్డీవో వాసు చంద్ర, హౌజింగ్ ఈఈ కృష్ణయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలను మోసం చేస్తున్న రేవంత్ సర్కార్

మక్తమాదారంలో బీఆర్ఎస్ పార్టీ దిమ్మెను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ మడలాధ్యక్షుడు పరమేశ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా

కడ్తాల్, ఏప్రిల్ 22 : రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను రేవంత్ సర్కార్ మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కంబాల పరమేశ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా విమర్శించారు. మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి వారు పర్యటించారు. ఈ నెల 27న గ్రామాల్లో నిర్వహించనున్న బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సబ్బండ వర్గాలను మోసం చేస్తున్నదని తెలిపారు. పూర్తి స్థాయిలో రుణమాఫీ, రైతు భరోసా అమలు కాకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో అలవి కానీ హామీలను గుప్పించి, వాటిని అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నదర కావొస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఒరగబెట్టింది ఏమి లేదని ఎద్దేవా చేశారు. పింఛన్ 4 వేలు, కల్యాణలక్ష్మి తులం బంగారం, మహిళలకు రూ.2,500, యువతులకు స్కూటీ, దివ్యాంగులకు రూ.6 వేలు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయిలు, మాజీ ఎంపీటీసీలు గోపాల్, చంద్రమౌళి, మాజీ ఉప సర్పంచ్ గణేశ్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు జనీల్‌కుమార్, మహేందర్, రామకృష్ణ, ప్రశాంత్, రమేశ్, సురేశ్, కృష్ణ, సత్యనారాయణ, నగేశ్, చంద్రయ్య, శ్రీను, ఆంజనేయులు, నరేందర్, నర్సింహ పాల్గొన్నారు.

నీటి కొరతను అధిగమించేందుకు నిధులు

సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, ఏప్రిల్ 22 : జిల్లాలో నీటి కొరతను అధిగమించేందుకు నిధులు కేటాయిస్తామని శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో స్పీకర్‌తో పాటు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కాలె యాదయ్య పాల్గొని పలు అంశాలపై సమీక్షించారు. నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే బోర్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా అందించే ఓహెచ్ఆర్ ట్యాంకులను శుభ్రం చేస్తూ నాణ్యమైన నీటిని సరఫరా చేయాలని సూచించారు. అనంతరం సంక్షేమ వసతి గృహాల్లో కల్పించిన మౌలిక వసతులు, పెయింటింగ్ వేసిన దృశ్యాలను పవర్ ప్రజెంటేషన్ ద్వారా డీఎస్వీడబ్ల్యూవో మల్లేశం వివరించారు. అలాగే సంక్షేమ వసతి గృహాలకు స్పీకర్ వంట సామగ్రిని అందజేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి

పిల్లల తల్లిదండ్రులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు మార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన పోషణ్ పక్ష ముగింపు ఉత్సవాల్లో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి స్పీకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో పాటు ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తట్టేపల్లిలో నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీం

ఉపాధి హామీ పనుల దస్త్రాల పరిశీలన

రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దేముల్, ఏప్రిల్ 22 : మండలంలోని తట్టేపల్లి గ్రామాన్ని నేషనల్ లేవల్ మానిటరింగ్ టీం మంగళవారం సందర్శించింది. ఆ బృందం సభ్యులు పంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీ రికార్డులను పరిశీలించారు. జాబ్ కార్డులు, పనులకు సంబంధించిన పేమెంట్లు, నేమ్ బోర్డులు తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శి, టీఏను ఆరా తీశారు. ఒక వ్యక్తికి జాబ్‌కార్డు ఇవ్వాలంటే ఎలాంటి అర్హతలుండాలని పంచాయతీ కార్యదర్శి గోపాల్‌ను ప్రశ్నించారు. గ్రామసభలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి కార్యదర్శిపై మండిపడ్డారు. కోరం లేనిదే గ్రామసభలు ఎలా నిర్వహించారని నిలదీశారు. గ్రామంలోని నర్సరీని స్వయంగా సందర్శించి దాని నిర్వహణ తీరుపై మండిపడ్డారు. కార్యక్రమంలో పీవో వివేక్‌రాజ్, బీడీవో అశిష్‌శ్రీవత్సల్, ఏపీడీ సరళకుమారి, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ సతీశ్ రెడ్డి, డీఆర్‌డీవో వెంకట్రామరెడ్డి, ఏపీవోలు శంకర్, సుధాకర్, నర్సింహులు, ఈసీలు కృష్ణ, సైదులు, ఇలియాజ్, శ్రావణ్, టీఏలు సిద్ధు, శ్రావణ్, మల్లేశ్, విజయ్ పాల్గొన్నారు.

ఈనెల 29నుంచి హజ్ యాత్ర

అధికారులకు సూచనలిస్తున్న షేక్ యాస్మిన్

సిటీ బ్యూరో, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టే హజ్ యాత్రకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఈనెల 29 నుంచి మే 29 వరకు విమాన సర్వీసులు అందుబాటులో ఉంటాయని మైనార్టీ సంక్షేమ శాఖ సంచాలకులు షేక్ యాస్మిన్ భాష అన్నారు. హైదరాబాద్‌లోని హజ్ హౌస్‌లో ఏర్పాటుచేసిన సమన్వయ సమావేశంలో మంగళవారం ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు పలు రాష్ట్రాల నుంచి ఈ ఏడాది 11 వేల మంది హజ్‌యాత్ర చేయనున్నట్లు తెలిపారు. వారికి ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. మదీనాకు ఏప్రిల్ 29 నుంచి మే 13 వరకు, జిద్దాకు మే 16 నుంచి మే 29 వరకు విమానాలు నడుస్తాయని తెలిపారు. జిద్దా నుంచి తిరిగి వచ్చే విమానాలు జూన్ 12 నుంచి జూలై 9 వరకు మధ్య నడుస్తాయని, 31 విమానాలు యాత్రికులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సజ్జాద్ అలీ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఇర్ఫాన్ షరీఫ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేట్లబురుజు ఆసుపత్రిలో అరుదైన చికిత్స

పిత్తాశయం, గర్భ సంచి సమస్యలతో బాధపడుతున్న 46 ఏళ్ల మహిళ

శస్త్రచికిత్సతో మహిళ ప్రాణాలు కాపాడిన వైద్యులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 22, (నమస్తే తెలంగాణ): కడుపునొప్పి, మూత్రంలో మంటతో బాధపడుతున్న 46ఏళ్ల ఓ మహిళకు శస్త్రచికిత్స చేసి పిత్తాశయం, గర్భసంచి తొలగించిన అరుదైన ఘటన పేట్లబుర్జ్‌లోని మోడర్న్ గవర్నమెంట్ మెటర్నిటీ ఆసుపత్రిలో చోటుచేసుకుంది. వివరాలు.. నేపాల్‌కు చెందిన 46 ఏళ్ల చందా థాపా అనే మహిళ సికింద్రాబాద్‌లో నివాసముంటోంది. కాగా ఆమెకు 3 నెలలుగా తీవ్ర కడుపునొప్పి, మూత్రంలో మంట కలగడంతో అనేక ప్రైవేట్ ఆసుపత్రుల చుట్టూ తిరిగారు. అయినా కూడా నొప్పి తగ్గకపోవడంతో వారం రోజుల క్రితం పేట్లబుర్జ్‌లోని మోడర్న్ గవర్నమెంట్ మెటర్నిటీ ఆసుపత్రిలో చేరారు. వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమె కడుపులో గడ్డ, పిత్తాశయంలో రాళ్లు ఉన్నట్లు నిర్ధారించారు. గైనకాలజిస్టు డాక్టర్ సుజాత హిస్టరెక్టమీ, యూనిలేటరల్ ఊఫొరెక్టమీ శస్త్రచికిత్స నిర్వహించి 1.6 కిలోల గర్భసంచి తొలగించగా, జనరల్ సర్జన్ డాక్టర్ రమేష్ చోలీసిస్టెక్టమీ శస్త్రచికిత్స చేసి 2.51సెంటీమీటర్ల రాళ్లుకలిగిన పిత్తాశయాన్ని తొలగించారు. రెండు శస్త్రచికిత్సలు ఏకకాలంలోనే విజయవంతంగా నిర్వహించి రోగిప్రాణాలు కాపాడారు.

నిమ్స్‌లో పటాకులు నిజమే

- ఆరోగ్యశ్రీ కార్యాలయంలో పటాకులను తాను చూశానంటూ డైరెక్టర్‌కు వైద్యాధికారి ఫిర్యాదు
- ఆ వీడియోలు తానే తీశానంటూ ఏసీపీకి వాంగ్మూలం
- నలుగురు ఆరోగ్యశ్రీ సిబ్బందిని విచారిస్తున్న పంజాగుట్ట పోలీసులు
- అమాయకులపై నెట్టివేసేందుకు ప్రయత్నాలా...?

ఖైరతాబాద్, ఏప్రిల్ 22 : నిమ్స్‌లో పటాకుల కేసు రోజుకో మలుపుతిరుగుతోంది. ఈ నెల 19న నిమ్స్ ఎమర్జెన్సీ విభాగంలోని ఐదో అంతస్తులోని ఆడిటోరియంలో అగ్ని ప్రమాద ఘటన చోటు చేసుకోవడం విదితమే. అయితే ఇదే ఘటనలో ఆసుపత్రిలో పటాకులు సైతం బయట పడటంతో దవాఖానలోని భద్రతా వైఫల్యం వెలుగు చూసింది. ఇప్పటికే ఈ ఘటనలపై పంజాగుట్ట పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తుండగా, అగ్ని ప్రమాదానికి మాత్రం సిగరెట్లు, బీడీలే కారణమని ధృవీకరించారు. ఇక పటాకుల కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా వాటిని మాయం చేశారన్న ఆరోపణలు వచ్చాయి. దీనికి తోడు ఐదో అంతస్తులో కనీసం సీసీ కెమెరాలు లేకపోవడంతో ఈ కేసును ఎటు తేల్చాలో అర్థం కాక పోలీసు అధికారులు తలలుపట్టుకొని కూర్చోగా ఓ అధికారి ఇచ్చిన వాంగూల్మం వారి కేసుకు బలం చేకూర్చినట్లు తెలుస్తోంది.

ఆస్పత్రుల్లో పటాకులు చట్టవిరుద్ధం...

పటాకులకు చట్టాలు పలు పరిధులు ఉంచాయి. అసురక్షితమైన పద్ధతుల్లో వాటిని భద్రపర్చవద్దు. నిబంధనలకు లోబడి ఆస్పత్రులు, విద్యాలయాల్లో పటాకులను ఉంచకూడదు. ఎక్స్‌ప్లోజివ్ రూల్స్–2008 ప్రకారం.. ఆస్పత్రులు ప్రొటెక్టెడ్ వర్క్ పరిధిలోకి వస్తాయి. అంతేకాకుండా దవాఖానల్లో పటాకులు కాల్చడం కూడా తప్పవుతుందంటున్నారు. ఈ విషయాలను సదరు వైద్యాధికారి డైరెక్టర్‌కు ఇచ్చిన లేఖలో పొందుపర్చడం గమనార్హం.

ఆ వీడియోలు నిజమే...

నిమ్స్ ఆడిటోరియంలో జరిగిన అగ్ని ప్రమాద ఘటన సమయంలో దానికి ఆనుకొని ఉన్న ఆరోగ్యశ్రీ కార్యాలయంలో పటాకులు దర్శనమిచ్చాయి. నిమిషాల వ్యవధిలోనే దానికి సంబంధించిన ఆ వీడియోలన్నీ ప్రసార మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు అక్కడికి చేరుకోగా, గంటల వ్యవధిలోనే అవి మాయయ్యాయి. కాగా, అవన్నీ ఫేక్ వీడియోలని తేల్చే పనిలో నిమ్స్‌లోని ఓ వైద్యాధికారి ఉండగా, ఆ వీడియోలు తానే తీశానంటూ మరో వైద్యాధికారి నిమ్స్ డైరెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడమే కాకుండా.. నేరుగా పంజాగుట్ట పోలీసు స్టేషన్‌కు వెళ్లి పోలీసు ఉన్నతాధికారికి సైతం వాంగ్మూలం ఇచ్చారు. దీంతో పటాకుల కేసులో కొత్త ట్విస్టు నెలకొంది. ఆరోగ్యశ్రీ కార్యాలయంలో పటాకులున్నట్లు తనకు సమాచారం రావడంతో హుటాహుటిన అక్కడికి వెళ్లి వీడియోలను తీసి సాక్షాలను సేకరించానని సదరు అధికారి ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసులో అసలు దోషులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నలుగురు సిబ్బందిని విచారిస్తున్న పోలీసులు

ఆరోగ్యశ్రీ కార్యాలయంలో పటాకుల కేసులో వైద్యాధికారి ఇచ్చిన వాంగూల్మం పోలీసుల దర్యాప్తునకు బలం చేకూర్చింది. అయితే దీపావళికి ఎనిమిది నెలలు ఉండగానే ఇక్కడ పటాకులు స్టాకు చేసుకోవాల్సిన అసరం ఎవరికి వచ్చింది.. లేక గతేడాది పండుగ కోసం తెచ్చినవా....పెద్దల ఫంక్షన్ల కోసం ఎవరైనా తెచ్చి పెట్టుకున్నారా అన్నది ఇంకా తేలలేదు. సాధారణంగా నిమ్స్‌లోని పలు వార్డుల్లో సిబ్బంది నైట్ డ్యూటీలు సైతం చేస్తుంటారు. అయితే అక్కడ పటాకులు రావడానికి ఆ సిబ్బందే కారణమై ఉంటారని భావించారేమే... ఇప్పటికే ఓ వైద్యాధికారి ఆరోగ్యశ్రీ సిబ్బందికి కొన్ని ప్రశ్నలతో మల్టిపుల్ చాయిస్‌లో అకనాలెడ్జిమెంట్ లేఖలు సైతం అందించినట్లు సమాచారం. కాగా, ఈ కేసును కొందరు అమాయక సిబ్బందిపై నెట్టివేసే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నలుగురు ఆరోగ్యశ్రీ సిబ్బందిని మాత్రం పోలీసులు విచారిస్తుండగా, అసలు దొంగ ఎవరో పోలీసులు నిగ్గు తేల్చాల్సి ఉందంటున్నారు.

ఎన్‌డీపీఎస్ చట్టం కింద ఆస్తుల జప్తు సబబే

★ తీర్పు వెలువరించిన హైకోర్టు

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): ఎన్‌డీపీఎస్ చట్టం కింద ఆస్తుల జప్తును సమర్థిస్తూ హైకోర్టు తీర్పు వెలువరించింది. నేరపూరిత సొమ్ముతో వాటిని ఆర్జించలేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత నిందితుడిపైనే ఉంటుందని తేల్చి చెప్పింది. ప్రత్యామ్నాయ అప్పీలు అవకాశాలుండగా విచక్షణాధికారం పేరుతో హైకోర్టులు నేరుగా జోక్యం చేసుకోజాలవని తేల్చి చెప్పింది. ఎన్డీపీఎస్ చట్టం కింద నమోదు చేసిన కేసులో షాద్ నగర్ పోలీసులు చేసిన స్థిర, చరాస్తుల జప్తు ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ షాద్‌నగర్‌కు చెందిన గుండుమల్ల వెంకటయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఎన్ .వి.శ్రవణ్ కుమార్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ వాదనలు వినిపిస్తూ 2024 ఫిబ్రవరిలో రూ.కోటి విలువైన స్థిరాస్తులను, రూ.4 లక్షల బ్యాంకు నగదును సీజ్ చేశారన్నారు. పోలీసులు కేసులు నమోదు చేయకముందే వీటిని కొనుగోలు చేశారన్నారు. ప్రభుత్వ న్యాయవాది మహేష్ రాజె వాదనలు వినిపిస్తూ సోదాల్లో 2 కిలోల ఆల్ప్రాజోలంను సీజ్ చేశారన్నారు. దీన్ని కల్తీ కల్లు తయారీకి వినియోగిస్తారని, ఒక బాటిల్ కల్తీ కల్లుకు 0.25 నుంచి 0.5 మిల్లీగ్రాములు సరిపోతుందన్నారు. ఆదాయపు పన్ను లెక్కల ప్రకారం రూ.35 లక్షల ఆదాయం ఉండగా రూ. కోటి విలువైన స్థిరాస్తులను కొనుగోలు చేశారన్నారు. భార్య, కుమారులకు ఎలాంటి ఆదాయం లేకపోయినా వారి పేరుతో ఆస్తులున్నాయన్నారు. పిటిషనర్‌పై గచ్చిబౌలిలో కూడా కేసు నమోదైందన్నారు. మత్తుపదార్థాల వ్యాపారం తరచూ చేస్తుంటారన్నారు. ఆదాయానికి సంబంధించి ఎలాంటి ఆధారాలను చూపలేదన్నారు. అధీకృత మండలి ఉత్తర్వులను సవాలు చేయడానికి దిల్లీలోని అప్పీలెట్ అథారిటీని ఆశ్రయించకుండా 9 నెలల తరువాత హైకోర్టును ఆశ్రయించారన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి జప్తును ధ్రువీకరిస్తూ తగిన కారణాలతో అధీకృత మండలి ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పారు. అయితే కుటుంబ అవసరాల కోసం, వైద్య ఖర్చుల కోసం కింది కోర్టులో దరఖాస్తు చేసుకుని తగిన మొత్తాన్ని పొందవచ్చని పేర్కొంటూ పిటిషన్ ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించారు.

భవిష్యత్‌లో బలమైన పోరాటాలు అవసరం

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 22: కార్మిక వర్గం తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం భవిష్యత్‌లో బలమైన పోరాటాలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభ దానికి నాంది కావాలని ఎమ్మెల్సీ నెళికంటి సత్యం పిలుపునిచ్చారు. శంషాబాద్ పట్టణంలో నిర్వహిస్తున్న మహాసభలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పన్నుల పేరుతో పేదల దగ్గర దోచుకొని ధనవంతులకు కట్టబెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్ల బీజేపీ పాలనలో నిత్యవసర ధరలతో పాటు ఇతర ధరలు విపరీతంగా పెంచడంతో పేదవర్గాలు నిత్యవసర వస్తువులు కొనలేని దుస్థితిలో ఉన్నారని వివరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేసే వరకు ఏఐటీయూసీ ఉద్యమాలు ఆగవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి నర్సింహ, దేవేందర్‌రెడ్డి, రమేష్, ప్రవీణ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు , దత్తునాయక్, సత్యనారాయణ,నర్రగిరి, అన్నేపు ప్రభులతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.